# సిగ్గు-సిగ్గు

## మల్లిక్ మోహనరావు

అది అసెంబ్లీ!

"అయ్‌బాబోయ్" అని ఈడుచుకు పడ్డాడు ఎమ్మెల్లే వెంకయ్య.

లేచి బట్టలు దులుపుకొని ఓసారి చుట్టూ కలియజూసి చటుక్కున అసెంబ్లీలోకి జొరబడ్డాడు.

"నన్నెవ్వడు బయటకు గెంటాడో మర్యాదగా చెప్పండి. లేదా వాడిపై పరువు దావా వేయగలను" అన్నాడు కోపంగా!

"నీకు పరువు కూడా వుందారా?" ప్రతిపక్ష పార్టీ గుంపులోంచి ఎవడో అన్నాడు.

"అదిగో నన్నెవడో తిట్టాడు. వాడు కూడా ముందుకువస్తే సరి. లేదా వాడిపై కూడా...." ఏదో అనబోయాడు.

"సాల్‌జేయ్‌వయ్యా. బోడి పరువు గాడవు మాకు లేని 'ఇజ్జత్' నీకెక్కడిదిమల్లా" కాస్త రోషంగానే అన్నాడు వెంకయ్య పార్టీ అధ్యక్షుడు.

"అదికాదు సార్! కుక్కలా నన్ను బయటికి గెంటుతారా వీళ్లు. కాలు విరిగినా, చెయ్యి విరిగినా ఎంత డేంజర్"

"గామాత్రం ఓర్పులేంది ఎమ్మెల్లేగ పోటీ చేసి ఎందుకు గెలిచినవ్?"

"ఎమ్మెల్లే నయినంత మాత్రానా ఇలాంటి దెబ్బల్ని కూడా ఓర్చుకోవాలా?" వెంకయ్య కళ్ళలో వాటర్. తెలుగుగంగలా గిర్రున తిరిగాయి.

"ఓయ్- గిందుకే అంట- సాంతిభద్రతల సమావేశాలకు రావొద్దని" అన్నాడు పార్టీ అధ్యక్షుడు తన 'ఒరిజినల్' భాషలో

"శాంతి బద్రతల సమావేశాలకె కొట్లక తగలడితే...."

"వూర్కోవయ్య- సప్పుడు చేస్తివో నిన్ను యిప్పుడే పార్టిలోంచి పీకిపారేస్త- ఆ...." మీసాన్ని తిప్పుతూ అన్నాడు.

"అంతేలే- ఎక్కువ వాగితే పార్టిలోంచి తీసేస్తాని భయపెతతారు. పీకేయండి. ఏ.... నేనో కొత్త పార్టీ పెట్టుకోలేనా?"

"అవునే సార్-మరో కొత్తపార్టీ పెట్టండి నేనో యాభై మందిని తెస్త. ఆ తరవాత...." ప్రతిపక్ష ఎమ్మెల్లే అప్పుడే ఆ పార్టీకి రాజీనామా చేయ నిశ్చయించుకున్నాడు.

"వూర్కోవయ్య- ఏదో మాటవరస కంటే నిజంగానే అనుకుంటున్నావు అంత దబ్బే వుంటే దీంట్లో ఎందుకు దిగేవాడిని? అమ్మాయిల పెళ్ళిళ్ళు చేసేవాడిని" అన్నాడు ఒక మూల కూర్చుంటూ!

స్పీకర్ తలబాదుకుంటూ అన్నాడు.

"ఇదో! చివరిసారిగ చెబుతున్న ఇప్పుడెవడైనా లేసారో- కొట్టుకున్నారో- మైకులు విరగ్గొట్టారో- నేను వూరుకోను. కథ అడ్డం తిరుగుతుంది. ఆ...." ఓపిక నశించి అన్నాడు స్పీకర్ రాజారాం.

"మరి నాకు సీటులేదా" అన్నాడు అధికార పార్టీ ఎమ్మెల్లే.

"దానికి నేనేం చేయలేను. ఉన్న సీట్లు విరగకొట్టొద్దని ముందే చెప్పాను"



"మేము ఎలాగో కొట్టుకుంటామని నీకు తెల్సుగద! తెలిసి ఎక్స్ట్రా కుర్చీలు ఎందుకు తెప్పించలేదు. అసలు నువ్వు స్పీకర్ నేనాని— లే- నీ కుర్చీ నాకిచ్చి అలాగే నిలబడు. అప్పుడు గానీ నీకు తెలిసిరాదు"

"ఆరెవో— నేనో స్పీకర్నన్న విషయం మరిచావా? లేచి అక్కడి వరకు వచ్చానో...." పళ్ళు పటపటపట కొరికాడు. పిడికిళ్లు బిగుసుకున్నాయి.

"అంతటి వీరుడవా? ఆ ప్రతాపమేమిటో మొన్న గవర్నర్ మీద చూపలేక పోయావా? సరేలే అని వదిలేస్తున్న" అంటూ విరిగి పోయిన కుర్చీమీదే కూర్చున్నాడు.

కొద్దిసేపటికి అలజడి తగ్గింది.

శాంతిభద్రతల సమావేశం మళ్లీ ప్రారంభమయ్యింది.

"మీరు అడగవల్సింది ఏమైనా వుంటే అడగవచ్చు" అన్నాడు స్పీకర్ కళ్ళజోడు సర్దుకుంటూ.

"మొన్న జరిగిన ఆరవ అం........"

"మొదట అధికార పార్టీ వారిని అడగాలని తెల్వదా స్పీకర్ జీ" అన్నాడో అధికార పార్టీ ఎమ్మెల్లే.

"మొదట మిమ్మల్నేఅడిగా మకతవయ్యా" స్పీకర్ పళ్లు పటపట మంటూనే వున్నాయి.

"అయితే కావచ్చు. కాని మిమ్మల్ని మళ్లీ అడగాల్సిందే. ఎందుకని అడగకు. అది



అంతే".

"చూడు సామి. అధికారం వుందని పెత్తనము చేయించకు. మేము గాజులు పెట్టుకొని లేము. మాకూ కండబలముంది. పౌరుషాలున్నాయి" అన్నాడు ప్రతిపక్ష ఎమ్మెల్లే.

"అబ్బా! అంతటి మొనగాళ్ళన్నమాట"

"సైలెన్స్ - సైలెన్స్.... ఇది అసంబ్లీ లేక ఏమనుకున్నారు. ఎవరైనా వింటే మీతో పాటు నా పరువు కూడా పోతుంది" స్పీకర్ గంతులేశాడు.

"నువ్వేంటయ మధ్యలో-వాడు తిడుతుంటే వింటు వూరుకోవా ఏందీ వాడెంత వాడి బ్రతుకెంత. మొన్నటివరకు కల్లు కంపోండ్లలో కల్లుముంతలు ఏరినోడికి భయపడాలా మల్ల" అన్నాడు పళ్ళు కొరుకుతూ.

ఆ మాట చెవినబడగానే అధికార పార్టీ ఎమ్మెల్లే ఒకడు ఉలిక్కిపడ్డాడు. ఎందుకంటే అంతకుముందు . అతడు బ్లాక్‌లో గుడంబా (సారాయి) అమ్మేవాడు. కొంపదీసి అతని పైకి గాలి మల్లగలదని నిలవలేకపోయాడు.

"నీయాలి మా పార్టీ అధ్యక్షుడినే అంత మాట అంటావురా?" అని మైక్ విరగ్గొట్టి అతనిపైకి విసిరాడు.

అది గమనించిన ప్రతిపక్ష ఎమ్మెల్యే చల్లగా తప్పుకున్నాడు. అలాతప్పుకున్నాడంటె దానికో కారణం ఉండకపోదు ఒకానొకప్పుడు హత్య కేసులో ఇరుక్కున్నాడు పోలీసులు వెంటపడుతున్నారు కుక్కలు తరుముతున్నాయి ప్రజలు రాళ్ళు విసురుతున్నారు అయినా చెక్కుచెదరకుండా చాలా తెలివిగా తప్పించుకున్నాడు ఆనాడు. అదే ఫార్ములాను ఈనాడు అప్లయి చేశాడన్నమాట.

సరిగ్గా ఆ మైక్ అధికారపార్టీ కార్యదర్శి తలకు వక్కమంది. బొటబొట రక్తంకారడం మొదలుపెట్టింది.

> **అందుకేముందు**
>
> "ఏమ్మా! ఆడవాళ్ళని ముందెక్కమంటే వెనకెక్కుతావే వినబడటంలా!"
>
> కోపంగా అడిగాడు సిటీబస్సు కండక్టర్ వెనక డోర్‌లోంచి బస్సు ఎక్కుతున్న స్త్రీని!
>
> "ఆ! వినబడింది లేవయ్యా! అందుకేగా మొగ వాళ్ళ కంటే నేను ముందుగా ఎక్కుతున్నాను" జవాబిచ్చిందా అతివ.
>
> చామర్తి సాయిగంగాధర్
> విజయవాడ

అందరూ హేళనగా నవ్వారు.

"ఓరి నచ్చినోడ గురిపెట్టి కొట్టడం రానోడివి మాపార్టీలో చేరింది చాలక నాపై ఉన్న కోపాన్ని తీర్చుకొని ఈ అవకాశాన్నిఉపయోగించుకొంటావా నీయాలి. నిన్నుపార్టీలోంచి తీసేస్తున్న ఛత్! బైటికి నడు" అన్నాడు శాలువతో రక్తాన్ని తుడుచుకుంటూ.

"ఆయన బాబోయ్! అంతమాట అనకండి నాలుగు డబ్బులు సంపాదించి రాజకీయాల్లోకి దిగినోడికి అన్యాయం చేయకు" అతడు నవ్వకుంటూ ప్రాధేయపడ్డాడు.

"అరెవో నాకు నీ సంగతి తెల్వదారా అనుకుంటూనే ఉన్న నువ్వు ఇసుంటి పనేదో చేస్తావ్ అనుకుని "మొదట బయటికి నడుస్తావా గెంటించమంటావా?" అన్నాడు.

అతనిలో ఓపిక నశించింది.

"ఏమేపిట్ట ఎగిరెగిరి పడుతున్నావు. ఓహో బ్రతిమాలినకొలది తలపైకి ఎక్కిపోతున్నావు గమ్మున నోరు మూసుకొని కూర్చో. నోరు తెరిచావో ఆనాడు నువ్వు ప్రాజెక్ట్ వర్కులో యాభైవేల సిమెంటు బస్తాలు...., సుమిత్ర అనే అమ్మాయిని నువ్వు నమ్మించి హత్య ఒక కంపెనీని తగలబెట్టేసిన డ్యాష్ డ్యాష్ డ్యాష్ ఇవన్నీ చెప్పమంటావా?" మీసం తిప్పుతూ అన్నాడు.

అంతే! కార్యదర్శి నోరు తెరవకుండతప్పయిందని ఒప్పుకొని కూర్చున్నాడు.

స్పీకర్. తలబల్లకేసిబాదుకున్నాడు గత్యంతరం లేక అసలు వీళ్ళు మనుషులేనా అనుకున్నాడు. చివరికిలేని ఓపిక తెచ్చుకొని "మీరు ఆడగవచ్చు ఇక" అన్నాడు.

"ఛత్! ఇంకేం మీటింగయ్యి. మా కార్యదర్శి తలకు సొట్ట పడలేదా" ఒక చెంచాగాడు ఎగిరాడు.

ప్రతిపక్ష పార్టీ మెజారిటీ తక్కువున్నా. వాదోపవాదుల్లో ఏం తక్కువలేదు.

"వాడు వుంటే ఏందీ వూడితే ఏంది! ఇలాంటి దొంగ నా కొడుకులు ఎగిరిపోతేకానీ దేశానికి మంచి జరగదు. ఇప్పుడు మీటింగ్ జరగాల్సిందే" అన్నాడు తొడలు చరుస్తూ

"ఇంపాజిబుల్" ఇప్పుడు జరగదు"

"వూకోవేహె....జరగదంటె జరిగి తీరుతుంది"

"అసంభవం జరగడానికి వీలులేదు.

అంతలో ఎవరో అసెంబ్లీ తలుపులుమూసేశారు. మరొకడు లైట్లు ఆర్పేశాడు. అంతే! ఆ చీకట్లో

"ధన్....ధన్....డిష్యుం...."చస్తిరా దేవుడో"...."హెల్ప్...." అరేయ్ నాగోశిలాగకు నా కత్తెవడో లాగుకున్నాడురో దేవుడో...."

"అభేయ్ అంగి చింపకు...."పర్....పర్.... కస....కస....కుయ్యో....మొర్రో....

❋ ❋ ❋

మరుసటిరోజు ఒక దిన పత్రికలో

హైదరాబాద్, 14 ఆగస్టు. నేడు అసెంబ్లీలో జరిగిన శాంతిభద్రతల సమావేశం జయప్రదం కానందుకు స్పీకర్ విచారాన్ని వ్యక్తపరిచారు. వచ్చేనెల ఆరవ తేదీన ఈ సమావేశం జరగవచ్చని తెలిపారు. అధికారపార్టీ కార్యదర్శికి తలనొప్పిగా వున్నందుకు సమావేశం వాయిదాను అన్నిపార్టీలవారు ఏకగ్రీవంగా అంగీకరించారని అన్నారాయన.

అయితే కొన్ని కారణాలవల్ల తన పదవికి రాజీనామా చేయనున్నట్లు స్పీకర్ నేడు మా విలేకరులతో చెప్పారు. తన సొంత ఊరైన "సుఖము" గ్రామంలో గొర్రెలను కాపలా కాసుకుంటూ హాయిగా వుంటానని అన్నాడు ఎందుకో మరి.

